క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



వేమూరు: మిచాంగ్ తుపాను వల్ల రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇళ్లలో నీరు చేరింది. అధికారులు స్పందించి బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మంత్రి మేరుగ నాగార్జున స్పందించి బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌లో 45 కుటుంబాలను పునరావాల కేంద్రాలు తరలించడం జరిగిందని తెలిపారు. బాధితులను బాధ్యతగా చూసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతులను ఆదుకోవాలి



భట్టిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు పంటలు దెబ్బ తినడంతో తీవ్రంగా నష్ట పోయారని సీపీఎం మండల కార్యదర్శి జి. సుధాకర్ అన్నారు. మంగళవారం పెదపులివర్రు పంచాయతీలోని అక్కివారిపాలెంలో వర్షాలకు నేలవాలిన వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మినుము పంట పూర్తిగా దెబ్బ తిందని, రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీకేఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భారీ వర్షాలకు మాగాణి భూములలో వరి పంట నీటి పాలై తీవ్ర నష్టం వాటిల్లిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (ఎపికెఎస్) బాపట్ల అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఏవో జి. మీరయ్యకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. నష్టపోయిన రైతులకు ఇన్‌స్రూ ఇప్పించాలని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, మొక్కజొన్న, మినుము విత్తనాలను పూర్తి సబ్సిడీపై అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.సుధాకర్, ఎం.సత్యన్నారాయణ, కె.రామస్వామి, జి.నాగరాజు పాల్గొన్నారు.

నరేంద్రస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి దేవాలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం 23వ రోజు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామిని అలంకరించారు. స్వామి వారికి ప్రతి నిత్యం కల్యాణం నిర్వహిస్తున్నారు. అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

దుప్పట్లు పంపిణీ



చెరుకుపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ ఈవూరి గణేష్ కావూరు, రాజోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. గుళ్లపల్లి ఎస్టీ కాలనీలో నిరుపేదలకు దుప్పట్లు, ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి



భట్టిప్రోలు: తుపాను నేపథ్యంలో మండల ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు ప్రతి సచివాలయానికి మండల స్థాయి అధికారులను నియమించినట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వీరు సమీక్షించారు. ఏ సమస్య వచ్చినా అధికారులను సంప్రదించాలని కోరారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఏ జి. మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరం దాటి.. తీవ్ర నష్టం మిగిల్చి..!

మిచాంగ్ తుపాను తీరం దాటుతూ.. రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. కోతకొచ్చిన వరి, మినుము పంటలతో పాటు పచ్చిమిర్చి తోటలను ముంచేసింది. వరి పైరు, పనలు నీటిలో తేలాడుతూ కనిపించాయి. వాతావరణశాఖ సూచనలతో అధికార యంత్రాంగం అప్రమత్తం కావడంతో.. నష్ట తీవ్రత తగ్గింది. ఈదురు గాలులతో కూడి వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. జిల్లా మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి, అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు ధైర్యం చెప్పారు.

- బాపట్లలో తీరం దాటిన మిచాంగ్ తుపాను
- భారీ వర్షాలతో రైతులకు నష్టం
- నీట మునిగిన వరి, మినుము, మిర్చి పొలాలు
- ప్రభుత్వ అప్రమత్తతతో తగ్గిన నష్ట తీవ్రత
- నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మనోధైర్యం



కొల్లూరు: వర్షపు నీటిలో చాపలా పరుచుకున్న వరి పంట



పీవీపాలెం: రెడ్లపాలెం పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

కొల్లూరు: బంగాళఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను అన్నదాతలతోపాటు, సామాన్య ప్రజానికాన్ని హడలెత్తించింది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షానికి పంట పొలాలు తటాకాలని తలపించేలా మారాయి. తుపాను గమనాన్ని ముందు నుంచి పసిగడుతున్న వాతావరణ శాఖ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో తీవ్ర నష్టం వాటిల్లకుండా.. రైతాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేసింది. కొల్లూరు మండలంలో సాగులో ఉన్న వరి, మినుము పంటలు దెబ్బతిని, రైతులు నష్టపోయారు. చాలా వరకు ఇప్పటికే వరి కోత యంత్రాలతో కోతలు పూర్తి చేయడంతో పాటు, ధాన్యం అమ్మకాలు జరిపిన రైతులు ఒడ్డున ఉన్నారు. అయితే కోత పూర్తయినా.. పొలాల్లోనే ఉన్న వరి పనలు నీట మునగడంతో.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. సుమారు 7 వేల ఎకరాల్లో వరి కోతలు చేపట్టాల్సి ఉంది. మిచాంగ్ తుపానుతో చివరి దశకు వచ్చిన వరి పంట పొలాలు వర్షపు నీటితో ముంపునకు గురయ్యాయి. మండలంలోని కృష్ణా నదీ పరీవాహక గ్రామాల్లోని మెట్ట భూముల్లో సుమారు 700 ఎకరాల్లో సాగైన మినుము కోత పూర్తయ్యి.. నూర్పిడికి సమయం సమయంలో నీట మునగడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే.. ఇటుక పరిశ్రమల్లోని పచ్చి ఇటుకలు.. తడిచి పనికిరాకుండా పోయింది. రేపల్లె ఆర్డీఓ హేరాషారోన్, మండల ప్రత్యేకాధికారి రమణ, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావులతోపాటు, గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకుంటుందని భరోసా కల్పిస్తున్నారు.

చెరుకుపల్లి: మిచాంగ్ తుపాను నేపథ్యంలో మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పూర్తిగా నేలవాలింది. చేలల్లో భారీగా నీరు చేరటంతో వరి పనలు పూర్తిగా నానిపోయాయి. కొన్ని చోట్ల గాలివానకి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

కర్లపాలెం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల మండలంలో పైర్లకు భారీ నష్టం వాటిల్లింది. 13 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. సుమారు 11వేల ఎకరాల్లో కోతకు వచ్చిన పంట పూర్తిగా నేలవాలి, వర్షం నీటిలో నానుతోంది. సుమారు 200 ఎకరాల్లో పచ్చిమిర్చి తోటలు పూర్తిగా నీటమునిగాయి. ప్యారిలీ, తుమ్మలపల్లి, కర్లపాలెం, దుండివారిపాలెం, నర్రావారిపాలెం, పెద్దగొల్లపాలెం గ్రామాల్లో పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసి, సుమారుగా 650 మందిని తరలించారు. వీరికి డీపీఓ రాంబాబు, తహసీల్దారు కె.శివన్నారాయణ పర్యవేక్షణలో భోజనం ఏర్పాట్లు చేశారు. బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పునఃరావస కేంద్రాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, మండల పరిధిలోని తీర ప్రాంతాల్లో పడిపోయిన పొలాలను పరిశీలించారు. పలు గ్రామాల్లో పూర్తిగా మూడు గృహాలు, పాక్షికంగా ఐదు గృహాలు ధ్వంసమైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు, అలకాపురం, గోకరాజునల్లిబోయినవారిపాలెం, కోమలి, భవనంవారిపాలెం, చోడిపాలెం, ఖాజీపాలెం తదితర గ్రామాల్లో వర్షం ధాటికి వరి పంట నేలవాలింది. పొలంలో వర్షపు నీరు నిలిచిపోయింది. కొన్ని గ్రామాలలో వరి పనలు నీటిలో తేలియాడుతున్నాయి. మండలంలోని మొత్తం 11,500 ఎకరాలలోవరి సాగు చేస్తున్నారు. తుపాను ధాటికి 80 శాతానికి పైగా నష్టం వాటిల్లి ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్ అల్లూరులోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. రెండు నెలల క్రితం మిర్చి మొక్కలు నాటి చేతికందుతున్న తరుణంలో మిచాంగ్ తుపాను ధాటికి పంట పూర్తిగా నీటమునిగింది. దీంతో పచ్చి మిర్చి సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు లబోదిబోమంటున్నారు.

భట్టిప్రోలు: మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుండగా ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోత కోయని పంటలు నేల కొరిగి పోవడంతో వడ్లు పాడవుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వడ్ల పనలు నీటిలో తేలి ఆడుతున్నాయి. ఐలవరం దళితవాడలో ప్రాథమిక పాఠశాల చుట్టూ నీరు చేరింది. మండలంలో 112.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తెలిపారు. అమృతలూరు మండలంలో 114.0 మి.మీ.లు, చుండూరు మండలంలో 77.6మి.మీ.ల వర్షపాతం నమోదైంది. విఠలేశ్వర నగర్ కాలనీలో వర్షం ధాటికి మరలా నీరు చేరింది.

రేపల్లె: రేపల్లె నియోజకవర్గం లోని లోతట్టు ప్రాంతాలతో పాటు సాగు భూమిలో పంటలు సైతం నీట మునిగాయి. తుపాను బాపట్ల ప్రాంతంలో తీరం దాటడంతో 1977 దివి సీమ ఉప్పెనను, 1990 గాలి వానను తలపిస్తుందని ఈ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జలమయమైన లోతట్టు ప్రాంతాలలో అధికారుల బృందం సభ్యులు వేర్వేరుగా పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఆర్డీవో హేలా షారోన్ నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ప్రజలకు ధైర్యం చెబుతున్నారు. ఆహారం, మౌలిక సదుపాయాలు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచినట్లు ఆర్డీవో షారోన్ తెలిపారు. తహసీల్దారు మల్లికార్జునరావు, ఎంపీడీవో శివ పార్వతి, మున్సిపల్ కమిషనర్ విజయసారథి నిరంతరం లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తూ పునరావాస కేంద్రాలలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ అధికారి వాగోలు బుష్ మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటిస్తూ సాగు భూమిలో నీట మునిగిన వరి ఓదెల వివరాలు సేకరిస్తున్నారు.

బాపట్ల అర్బన్: మిచాంగ్ తుపాను సూర్యలంక వద్ద తీరం దాటింది. ఈ సమయంలో బలమైన గాలులతోపాటు భారీ వర్షాలు కురిశాయి. గాలులకు చెట్లు నేలకూలాయి. కోతకు వచ్చిన వరి పంటలు ఒరిగిపోయాయి. వర్షం ధాటికి వాగులు పొంగాయి. అనేక చోట్ల ఆనకట్టలు తెగి రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం కలిగింది. సూర్యలంక సముద్రం తీరం సుమారు 50 అడుగుల మేర ముందుకు దూసుకొచ్చింది. కడలిపై అలలు ఎగసి పడ్డాయి. విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ముందస్తుగా జిల్లా అంతటా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. వారికి అవసరమైన నిత్యావసరాలు, ఆహార పదార్థాలు అందించింది. సుమారు 20 వేల ఎకరాల్లో వరి పైరు దెబ్బతింది. మండల వ్యాప్తంగా అక్కడక్కడా సాగు చేసిన మిరప నారు చేలల్లోకి నీరు చేరింది. వెదుళ్లపల్లి, స్టువర్టుపురం ప్రాంతాల్లో పూల మొక్కలు, ఆకు కూరల తోటలు నీట మునిగాయి. తుపాను ధాటికి బాపట్ల పట్టణంలోని చీలు రోడ్డు రామాలయం వద్ద గోడ కూలింది.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులు మనోధైర్యంతో ఉండాలని, పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మంగళవారం మండలంలోని రావికంపాడు అడ్డరోడ్డు వద్ద తుపాను దాటికి నేల కొరిగిన వరి పంటను ఆయన పరిశీలించారు. తుపాను నష్ట తీవ్రతను తగ్గించేందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహించి, అప్రమత్తం చేశారని, నిధులు విడుదల చేసి, ముందస్తు సహాయక చర్యలను ముమ్మరం చేశారని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవడం జరగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ అయిల సుబ్బారావు, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, నాయకులు ఆయన వెంట ఉన్నారు.



రావికంపాడు అడ్డరోడ్డులో వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

అధికారులతో ఎంపీ మోపిదేవి సమీక్ష

నిజాంపట్నం: నిజాంపట్నం తీరంలో సముద్రపు అలలు ఉవ్వెతున్న ఎగిసిపడటంతో పాటు ఈదురుగాలులు అధికంగా వీస్తున్నాయి. మండలంలోని రహదారులపై చెట్లు విరిగి పడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రోడ్డుపై విరిగిపడిన చెట్లను తొలగించే పనిలో ఆయా గ్రామాల అధికారులు, గ్రామస్తులు నిమగ్నమయ్యారు. పంట పొలాలు జలమయంగా మారాయి. పునరావాస కేంద్రల్లో ఉన్న ప్రజలకు భోజనం, సాగునీటి వసతులను అధికారులు కల్పించారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణ రావు తహసీల్దార్ కార్యాలయం నుంచి నష్టం అంచనాపై ఆరా తీశారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలకు సరైన వసతులు కల్పించడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. అదే విధంగా ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, ఎంపీటీసీ హరనాథబాబు నిజాంపట్నం గ్రామంలో పర్యటించారు. రోడ్లపై నిలబడి ఉన్న నీటిని కాల్వలోకి మరలించే విధంగా చర్యలు చేపట్టారు.





పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో హేలా షారోన్



వర్షపునీటిని తరలించే పనిలో ఎంపీటీసీ మోపిదేవి హరనాథబాబు



బాపట్ల పట్టణంలోని ఎంజీ రోడ్డులో నేలకొరిగిన వృక్షం



కర్లపాలెంలో నీట మునిగిన మిర్చి పొలం



మండేవారిపాలెంలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



వరహాపురంలో వరి పనలను పరిశీలిస్తున్న ఎంపీపీ మోహన్



భట్టిప్రోలు: ఐలవరంలో వర్షపు నీటిలో తేలుతున్న వరి పనలు



నేలవాలిన పంటను పరిశీలిస్తున్న రేపల్లె వ్యవసాయ శాఖ అధికారి బుష్



రేపల్లె పట్టణంలో నీట మునిగిన పద్మావతి థియేటర్ సెంటర్



కిష్కిందపాలెంలో నీటిలో మునిగిపోయిన పచ్చి ఇటుకలు



పోతార్లంకలోని అరటి తోటలో నిలిచిన నీరు..



బాపట్ల పట్టణం చీలురోడ్డులో కూలిన రామాలయం గోడ



చెరుకుపల్లి: నీటిలో నానుతున్న వరి పనలను పరిశీలిస్తున్న రైతు



గుళ్లపల్లిలో నేల వాలిన వరిపైరు



కొల్లూరు: గాజుల్లంకలో నీట మునిగిన మినుము పంటను ఒడ్డుకు చేర్చుతున్న రైతులు



నీటమునిగిన మిర్చి మొక్కలు చూపుతున్న కౌలు రైతు



భట్టిప్రోలు: ఐలవరం పాఠశాలలో చేరిన వర్షపు నీరు

వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: వివాహిత హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఈనెల 1న సంపత్ నగర్ 6వలైనులో షేక్ హసీనా అలియాస్ బాజి(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ సైదా అలియాస్ అల్లల్లతో వివాహేతర సంబంధం ఉంది. గతకొంతకాలంలో మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందని గుర్తించిన సైదా వారించాడు. ఈవిషయంలో బాజీ, సైదా మధ్య ఘర్షణ జరిగింది. ఈనెల 1న మిర్చి యార్డులో కూలికి వెళ్లిన బాజి సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన భర్త హుస్సేన్ పనికి వెళ్లే దుకాణానికి ఫోన్ చేయడంతో అప్పటికే బాజీ వెళ్లినట్లు వారు తెలిపారు. సైదాతో వివాహేతర సంబంధం ఉన్న విషయం అప్పటికే తెలిసిన హుస్సేన్ సంపత్‌నగర్‌లోని సైదా నివాసానికి వెళ్లాడు. బాజీ మృతిచెంది ఉండటం గమనించాడు. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్న కారణంతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సైదా గొంతునులిమి బాజీని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ముసుగులో నిందితుడు


శానిటేషన్ సంస్థకు నోటీసులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో శానిటేషన్ కాంట్రాక్టు నిర్వహణ బాధ్యత చేపట్టిన ఏజైల్ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. క్యాజువాల్టిలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 240 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉండాల్సి ఉండగా, కేవలం 170 మంది మాత్రమే పని చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పురాతన పద్ధతుల్లో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, తూతూ మంత్రంగా వారు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో శానిటేషన్ కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేశామన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లక్ష్మీపురం: గుంటూరు శ్యామలానగర్ గేటు వద్ద రైలు పట్టాలపై ఓ గుర్తు తెలియని(45) వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, విచారించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆర్పీఎఫ్ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546కు సమాచారం ఇవ్వాలని కోరారు.

డ్రెయిన్లలో పూడిక తీయించాలి



నెహ్రూనగర్: నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఇంజినీరింగ్ అధికారులను కోరారు. మంగళవారం కమిటీ సభ్యులు మెడికల్ క్లబ్, చుట్టగుంట, లాల్ పురం రోడ్ కల్వర్ట్, ఏటుకూరు రోడ్, కమ్మ శేషయ్య గ్రౌండ్, సత్యసాయి స్కూల్, జాతీయ రహదారి కల్వర్టర్లు, పొన్నూరు రోడ్ శారదా కోల్డ్ స్టోరేజ్ వెనుక, అగతరప్పాడు, రెడ్డిపాలెం, కాకాని రోడ్ ఉదయ్ హాస్పిటల్, ఓల్డ్ క్లబ్ రోడ్, వేళాంగిణి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టడం వలన ప్రస్తుత తుఫాన్ వలన ఎక్కువ ప్రాంతాలు ముంపునకు గురి కాలేదని అభిప్రాయపడ్డారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్.ఏ.సి.)సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు నారాయణ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు

వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రభుత్వ వైద్యశాలల్లో అధునాతన వసతులను ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పేర్కొన్నారు. వెల్లటూరు పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం కన్వీనర్, పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్ రామలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ వైద్యశాలలో రోగులకు మందులతో పాటు, కుక్క, పాముకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. గర్భిణులకు మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, తహసీల్దారు డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జి. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.